క్లుప్తంగా

ఆహ్లాదకరంగా బోట్‌క్లబ్ ఆవరణ



కమిషనర్ వెంకటరావును కలిసి సమస్యలు వివరిస్తున్న బోట్‌క్లబ్ వాకర్లు

కాకినాడ రూరల్: బోట్‌క్లబ్ ఉద్యాన వనానికి వచ్చే సందర్శకుల, వాకర్స్ సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పేర్కొన్నారు. ఆ ఉద్యాన వనాన్ని మంగళవారం ఆయన సందర్శించి వాకర్స్ నుంచి సమస్యలు తెలుసుకున్నారు. వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ కమిషనర్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఉద్యానవనం అంతటినీ పరిశీలించారు. జిమ్ పరికరాలను మరమ్మతు చేయించాలని, మరుగుదొడ్లను శుభ్రపరచాలని, ఏడాకుల చెట్లను తొలగించాలని, మార్కెట్ వైపు మరుగుదొడ్లను నిర్మించాలని కమిషనర్‌ను వాకర్లు కోరగా సానుకూలంగా స్పందించారు. గ్రంథాలయ నిర్వహణకు ఒక గదిని కేటాయిస్తానని ఆయన వారికి హామీని ఇచ్చారు. అన్న క్యాంటిన్‌ను పునరుద్ధరించనున్నందున పరిసరాలను శుభ్రం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అధికారులతో పాటు వాకర్స్ సంఘ ప్రతినిధులు దాసరి శ్రీధర్, రాఘవరావు, శ్రీరామరాజు, పోతుల బాబురావు, వెంకట్రావు, రమణారావు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి చేయూత



ఇస్త్రీపెట్టెను అందిస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: స్థానిక రామకృష్ణారావుపేటకు చెందిన రజకవృత్తిదారుడు బంగారుబాబుకు తలాటం హరీష్ మంగళవారం రూ.10 వేలు విలువైన ఇస్త్రీ సంబంధ పరికరాలను అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుజ్జు బాబు పాల్గొన్నారు.

మత్స్యకారుడి అనుమానాస్పద మృతి

కొత్తపల్లి: ఉప్పాడ-కోనపాపపేట బీచ్ రోడ్డులో అమీనాబాద్ పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న ముళ్ల పొదల్లో మంగళవారం ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తొండంగి మండలం యల్లయ్యపేటకు చెందిన మైలపల్లి జగన్నాథం(52) అమీనాబాద్‌లో ఉన్న బంధువులు, మత్స్యకారులతో కలిసి చేపల వేట సాగించేవాడు. అతడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ముళ్లపొదల్లో మంగళవారం అతడి మృతదేహం కనిపించడంతో పోలీసులకు స్థానికులు సమాచారమిచ్చారు. ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

కొత్తపల్లి: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పారిశుధ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. తాగునీటి పైపులైన్లలో లీకులు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు.

ఆక్వా చెరువులతో పంటలకు చేటు

- ఎమ్మెల్యే నానాజీకి రైతుల ఫిర్యాదు
- ఆయన సూచనలతో క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించిన అధికారులు



కరపలో మురుగుకాలువ నుంచి రొయ్యల చెరువుకు కొలత వేయిస్తున్న అధికారులు

కరప: నిబంధనలకు విరుద్ధంగా చెరువులు తవ్వి, ఆక్వా సాగు చేస్తున్నారని, దీంతో పంటభూములు దెబ్బతినడమే కాకుండా, తుపాన్ల సమయంలో పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కాకినాడ మత్స్యశాఖ ఎఫ్‌డీఓ ఆర్.నూకరాజు, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉమామహేశ్వరరావు, వీఎఫ్ఏ జి.గాయత్రి, డ్రెయినేజీ శాఖ ఏఈఈ కె.కీర్తి, ఇరిగేషన్ ఏఈఈ నాగిరెడ్డి భవాని, ఎంపీఓ ఏవీ రాజేష్, వీఏఏ ప్రశాంత్, ఆర్ఐ పేపకాయల మాచరావు తదితర అధికారులు మంగళవారం కరపలో పర్యటించి ఆక్వా చెరువులను పరిశీలించారు. చెరువుల చుట్టూ తిరిగి గట్లను పరిశీలించారు. చాలామట్టుకు నిబంధనల మేరకు తవ్వకాలు జరిపారని, రెండు మూడు చోట్ల నిబంధనలు మీరి చెరువుగట్లు ఉన్నాయని గుర్తించారు. పరిశీలించిన నివేదికను ఎమ్మెల్యేకు, ఉన్నతాధికారులకు వివరిస్తామని ఆయా శాఖల అధికారలు తెలిపారు.

మురుగు కాలువలు తవ్వించాలి

రొయ్యల చెరువుల వల్ల తమ పంట పొలాలు దెబ్బతింటున్నాయని, గత తొలకరి సీజన్‌లో అధిక వర్షాలకు శహపురం డ్రెయిన్, పాతర్లగడ్డ డ్రెయిన్‌లో నీరులాగక మళ్లలో వేసిన వరికుప్పలు మునిగిపోయి నష్టపోయామని, నారుమళ్లు కూడా ముంపునకు గురవుతున్నాయని, మురుగు కాలువలు తవ్వించాలని రైతులు మొరపెట్టుకున్నారు. ఆక్వా చెరువుల పరిశీలనకు వచ్చిన డ్రెయినేజీ శాఖ ఏఈఈ కె.కీర్తిని కరప, పేపకాయలపాలెం, పాతర్లగడ్డ గ్రామా రైతులు కలసి వారి సమస్యలు వివరించారు. పాతర్లగడ్డ, గురజనాపల్లి గ్రామాల మధ్యలో తవ్విన రొయ్యల చెరువుల వల్ల మురుగు కాలువ మూసుకు పోయిందని, ముంపునీరు, వర్షంనీరు లాగక నష్టపోతున్నామని, మురుగు కాలువలు తవ్వించాలని, పాతర్లగడ్డ రైతులు బండారు లక్ష్మణరావు, గంగరాజు తదితరులు ఏఈఈ పాతర్లగడ్డ డ్రెయిన్ పరిస్థితిని వివరించారు. శహపురం డ్రెయిన్ తవ్వించి చాలాకాలమైంది, దీనినికూడా తవ్వించాలని, రొయ్యల చెరువుగట్లు కూడా మూడు మీటర్లు ఖాళీ ఉండేలా చర్యలు తీసుకోవాలని పేపకాయలపాలెం రైతులు కోరారు. మురుగుకాలువల తవ్వించడానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే తవ్విస్తామని ఏఈఈ రైతులు వివరించారు. అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరిపల్లి, కరప, వేములవాడ, గురజనాపల్లి, పాతర్లగడ్డ, కొంగోడు, కూరాడ, వేళంగి, యండమూరు, జి.భావారం, సిరిపురం తదితర గ్రామాల్లో కూడా నిబంధనలకు విరుద్ధంగా పంట, మురుగుకాలువలు ఆక్రమించుకుని చేపల, రొయ్యల చెరువులు ఇష్టానుసారంగా తవ్వేశారని, ఒక కమిటీని వేసి మండల పరిధిలో ఆక్వా చెరువలన్నింటినీ పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.



మురుగు కాలువ, చెరువుల గట్లను పరిశీలిస్తున్న వివిధ శాఖల అధికారులు



డ్రెయినేజీ శాఖ ఏఈఈ కీర్తికి సమస్యలు వివరిస్తున్న రైతులు

ఎంపీ తంగెళ్లను కలిసిన ఎన్‌జీఓ నేతలు



ఎంపీ శ్రీనివాస్‌ను కలిసిన జిల్లా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ప్రతినిధులు

కాకినాడ సిటీ: కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లాలో ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో జిల్లా నాయకులు గుద్దటి రామమోహన్‌రావు, పేపకాయల వెంకటకృష్ణ, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, కేవీఎస్‌వీ ప్రసాద్, బి.విజయలక్ష్మి, వెంకటలక్ష్మి తదితరులు ఎంపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కలెక్టర్‌ను కలసిన ఎమ్మెల్యే నానాజీ



కలెక్టర్ నివాస్‌ను సత్కరించిన రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పంతం నానాజీ

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పంతం నానాజీ మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే నానాజీ కలెక్టర్ నివాస్‌ను దుశ్శాలువాతో సత్కరించి, నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

రాక్ సిరామిక్స్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: పెద్దాపురం-సామర్లకోట ఏడీబీ రోడ్డులోని మల్టీనేషనల్ కంపెనీ రాక్ సిరామిక్స్‌లో అక్రమంగా తొలగించిన కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ రాక్ సిరామిక్స్ యాజమాన్యం ఎన్నికల నోటిఫికేషన్ అడ్డు పెట్టుకొని 40 మంది కార్మికులను గేటు వద్ద ఆపేసిందన్నారు. కార్మికులను తొలగించి 64 రోజులైందని, భార్యా పిల్లలతో వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి సంస్థ యాజమాన్యం కార్మికుల జీవితాలతో ఆటలాడుతోందన్నారు. జాయింట్ లేబర్ కమిషనర్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినా పెడచెవిన పెట్టిందన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్మిక నాయకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా కంపెనీ పర్మినెంట్ వర్కర్స్‌గా పని చేస్తున్నామన్నారు. స్థానికులకు 75 శాతం మందికి పని కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఉన్నాయన్నారు. రాక్ సిరామిక్స్ యాజమాన్యం అన్యాయంగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లా కలెక్టర్, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. ధర్నా అనంతరం జాయింట్ కలెక్టర్ ఎస్ రామసుందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి.క్రాంతి కుమార్, పలివెల వీరబాబు, రాక్ సిరామిక్ కార్మికులు చంద్రశేఖర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యానికి ప్రాధాన్యం



కరపలో తాగునీరు, పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: వర్షాకాలం ప్రారంభం కాబోతోందని, గ్రామ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన గ్రామకార్యదర్శులు, సచివాలయ, పంచాయతీ సిబ్బందితో సమావేశమై వివిధ అంశాలపై చర్చించి, అనుసరించాల్సిన విధివిధానాలపై ఆదేశాలు జారీచేశారు. ప్రధానంగా సురక్షితమైన తాగునీరు అందించేందుకు, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. క్రమం తప్పకుండా తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, ప్రతిరోజూ క్లోరినేషన్ చేయించిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలన్నారు. మంచినీటి పైప్‌లైన్లకు లీకులు ఉంటే గుర్తించి, మరమ్మతులు చేయించాలన్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వీధులను శుభ్రం చేయించాలని, చెత్త లేకుండా పారిశుధ్య పనులు చేయించాలన్నారు. మురగు కాలువల్లో పేరుకుపోయిన సిల్టును తొలగించాలన్నారు. వీధుల్లో వర్షంనీరు నిలబడకుండా డ్రెయిన్లు లేనిచోట్ల కచ్చా డ్రెయిన్లు తవ్వించాలని ఎంపీడీఓ అప్పారావు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్, ఈఓ పీఆర్డీ బీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల మరమ్మతులు చేపట్టండి

కలెక్టర్‌కు దళిత నాయకుల వినతి



కలెక్టర్ నివాస్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ బాలాజీ చెరువు సమీపంలో ఉన్న అంబేద్కర్ కళాశాలల వసతి గృహాల మరమ్మతులు చేపట్టి వాటిని విద్యార్థులకు అనుకూలంగా అందుబాటులోకి తీసుకురావాలని దళిత నాయకులు మంగళవారం కలెక్టర్ జె.నివాస్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ అంబేద్కర్ హాస్టల్‌లో లోక్‌సభ మాజీ స్పీకర్ దివంగత నేత జీఎంసీ బాలయోగి వంటి ప్రముఖులు ఈ హాస్టల్‌లో ఉండి చదువుకున్నారని, గత నాలుగేళ్లుగా ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు అద్దె భవనాల్లో సరైన సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో దళిత పెద్దలు ప్రజాప్రతినిధుల దృష్టికి హాస్టల్ విషయం తీసుకెళ్లగా ఎమ్మెల్యే గ్రాంటు నుంచి రూ.45 లక్షలు, ఎంపీ గ్రాంటు నుంచి రూ.50 లక్షలు మంజూరు ఇచ్చారని వివరించారు. ఆ నిధులతో పనులు కూడా మొదలు పెట్టి డైనింగ్ హాలు శ్లాబ్ వేశారని, దీని నిమిత్తం కాంట్రాక్టర్‌కు రూ.23 లక్షలు గ్రాంటుగా నిధులు ఇచ్చారని కలెక్టర్ నివాస్‌కు దళిత నాయకులు వివరించారు. తరువాత కాంట్రాక్టర్‌కు రూ.24 లక్షలు ఇవ్వాల్సి ఉందని, బిల్లు మంజూరు కాకపోవడంతో పని జరగడం లేదన్నారు. నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టి భవనం మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అయితాబత్తుల రామేశ్వరరావు, జి.రవి, పి.రామారావు, టి.నూకరాజు, ఎస్.విజయశేఖర్, జె.రవితేజగౌతమ్, రమేష్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ప్రశస్తం



దివ్యాంగ బాలలకు శిక్షణ ఇస్తున్న సిబ్బంది

- వారి సంక్షేమమే లక్ష్యంగా యాప్
- ప్రభుత్వ పథకాల అందజేతకు సమగ్ర శిక్షా అభియాన్ ప్రత్యేక శ్రద్ధ

బాలాజీచెరువు: ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంక్షేమానికి సమగ్ర శిక్షా అభియాన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఏదో ఒక సాంకేతిక లోపంతో వారు కొన్ని పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారు. వారి ఆధార్ కార్డులో జనన తేదీలు, పేరు, చిరునామా వంటి వివరాలు తప్పు ఉండటం, బ్యాంక్ ఖాతా లావాదేవీలు లేకపోవడం, రేషన్, ఆధార్ కార్డుల్లో తప్పులు, లింక్ లేకపోవడం తదితర కారణాలతో సాయం పొందలేని పరిస్థితి ఉంది. దీన్ని అధిగమించేందుకు ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఎస్‌సీఈఆర్టీ ప్రశస్త యాప్‌ను సర్కార్ రూపొందించింది. ప్రత్యేక అవసరాలు గల బాలలకు వివిధ పరికరాల సాయంతో శిక్షణ ఇచ్చేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిని ఏపీ సమగ్రశిక్ష ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ పథకం ద్వారా నిర్వహిస్తున్నారు.

అర్హులకు ప్రయోజనం చేకూర్చేందుకే..

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడంతో అధికారులు సిబ్బంది విఫలమౌతున్నారు. ఇంటి వద్ద శిక్షణ పొందే పిల్లలకు విద్య, ప్రభుత్వ పథకాల లబ్ధి సైతం అందిస్తున్నారు. ఇంటి వద్ద శిక్షణ పొందే వారికి మరింత ప్రయోజనం చేకూరాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ యాప్‌ను తీసుకువచ్చింది.

21 రకాల వైకల్యాలు నమోదు..

ప్రశస్త యాప్‌లో వైకల్యాలను గుర్తించేందుకు 63 ప్రశ్నలు రూపొందించారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాల గుర్తింపునకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. భవిత కేంద్రాల్లో ఐఈఆర్టీలు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రత్యేక విద్యాబోధకులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

గుర్తించాల్సిన లక్షణాలు ఇవే..

దృష్టిలోపం, తక్కువ దృష్టి, వినికిడి, శారీరక (చలన) వైకల్యం, మేధో మానసిక వైకల్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యం, మెదడు పక్షవాతం (సెరిబ్రల్ పాల్సీ) ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, బహుళ వైకల్యం, లెప్రసీ బాధితులు, మరుగుజ్జు తనం, దీర్ఘకాలిక నరాల సమస్యలు, కండరాల క్షీణత, బహుళ నాడీ వ్యవస్థలో బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితులు, తలసేమియా, హిమోఫిలియా (రక్తం గడ్డకట్టని స్థితి) సికిల్ సెల్ వ్యాధి, (కొడవలి కణ రక్తహీనతత) వంటి వాటిని గుర్తించి యాప్‌లో నమోదు చేయాలి.

ప్రభుత్వ పథకాలకు ఆటంకం ఉండదు..



ప్రతి దివ్యాంగుడిని విధిగా గుర్తించేలా అందరి సమన్వయంతో కృషిచేస్తున్నాం. ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో లోపాలు గుర్తించేందుకు ఈ ప్రశస్త యాప్ దోహదపడుతుంది. వారిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పిల్లలకు సకాలంలో గుర్తించడం ద్వారా ప్రభుత్వ పథకాలు పొందే వీలుంటుంది.

– చామంతి నాగేశ్వరరావు, సీఎంఓ సమగ్రశిక్ష అభియాన్, కాకినాడ జిల్లా

టీకాలతో మూగ జీవాలకు రక్షణ

- వర్షాకాలంలో పశువులకు వ్యాధుల ముప్పు
- సకాలంలో వైద్యం చేయిస్తేనే మేలు
- మండలంలో 13 వేల పాడి పశువులు, 7 వేల గొర్రెలు, మేకలు



ఆవుకు టీకా వేస్తున్న సిబ్బంది

కొత్తపల్లి: వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధుల సమస్య అధికంగా ఉంటుంది. వాటి నుంచి పశువులను రక్షించుకోవాలంటే ముందస్తుగా టీకాలు వేయించాలి. సాధారణంగా వర్షాకాలం వస్తుందంటే పశువుల పెంపకందారుల్లో ఆందోళన మొదలవుతుంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో పశువులకు వ్యాదుల ముప్పుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ కాలంలో పశువులకు గొంతు వాపు, జబ్బవాపు. చిటుక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. జూన్-సెప్టెంబర్ మధ్య తొలకరి వర్షాల సమయంలో ఇవి వస్తుంటాయి. ఇవి సోకితే పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గినట్టుగా రైతులు భావించాలి. పాల దిగుబడి తగ్గడంతో ఆదాయ వనరులపై ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో పాడి రైతులకు అధికారులు కొన్ని సూచనలు చేస్తున్నారు. అవి ఓసారి తెలుసుకుందాం. మండలంలో సుమారు 13 వేల ఆవులు, గేదెలు, సుమారు 7 వేల గొర్రెలు, మేకలు ఉన్నట్టు పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధి ఇది. దీనినే గురక వ్యాధి అంటారు. వర్షాకాలంలో గేదెలు, ఆవులు ముఖ్యంగా దూడలకు అధికంగా వ్యాపిస్తుంది. ఒకసారి గొర్రెలు, మేకలు, పందుల్లో కూడా కనిపిస్తుంది. ఇది ఇతర పశువులకు వ్యాపిస్తుంది. కలుషితమైన నీరు, మేత వలన పశువులకు రోగ నిరోధకశక్తి తగ్గి వ్యాధులు సంక్రమిస్తుంటాయి. వాటికి ఈ వ్యాధి సోకితే కంటి నుంచి నీరు, నోటి నుంచి నురగ కారుతూ గురక వస్తుంది. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. జ్వరం తీవ్రత 106 నుంచి 107 డిగ్రీల వరకూ ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి ఆ ప్రాంతంలో వాపు వస్తుంది. ఈ వ్యాధి వచ్చిన 24 గంటల్లో పశువు మరణించే అవకాశం ఉంది.

నివారణ చర్యలు

వర్షాకాలం ముందు జూన్, జూలై నెలల్లో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వ్యాధి సోకితే ఆ పశువుల పాకను, గదులను ఫినాయిల్, క్రిమి సంహారక ద్రావణంతో శుభ్రం చేయాలి. వ్యాధి లక్షణాలు కనిపించినా పశువులకు వెంటనే మంద నుంచి వేరు చేయాలి. వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫాడిమిన్, ఇంటా సెఫ్‌జూ, ఎక్సెప్ట్ వంటి ఇంజెక్షన్లు ఇవ్వాలి. తప్పనిసరిగా పశు వైద్యాధికారిని సంప్రదించాలి.

జబ్బవాపు

ఈ వ్యాధి క్లాస్ట్రిడియం చావై బాక్టీరియా ద్వారా సోకుతుంది. పశువులకు ప్రాణహాని కలిగించే తీవ్రమైన అంటువ్యాధి. తెల్ల పశువుల్లో ఆరు నెలల నుంచి మూడేళ్ల ఉన్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. ఈ వయసు పశువులకు రోగ నిరోధకశక్తి చాలా తక్కువగా ఉంటుంది. మట్టి ద్వారా, కలుషితమైన మేత, నీటి ద్వారా పశువుల్లో ఈ వ్యాధి బయటపడుతంది. భుజం, తొడ ప్రాంతంలోని కండరాలను ఆశించి కుళ్లిపోయేలా చేస్తుంది. వెనుక, ముందు కాళ్లు లేపి కుంటుతుంది. దీని నివారణకు టీకా ఒక్కటే మార్గమని పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాపించేవి

వర్షాకాలంలో పచ్చ గడ్డి ఎక్కువగా పెరుగుతుంది. ఈ గడ్డి తినే మూగ జీవుల కడుపులోకి సూక్ష్మ క్రిములు వెళ్లి చిటుక (గొమ్మ) వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన వెంటనే గొర్రె లేక మేక అతి తక్కువ సమయంలోనే మృతి చెందుతుంది.

నివారణ చర్యలు

ఈ వ్యాధి సోకడానికి ముందుగానే పశు వైద్యులను సంప్రదించి ముందస్తు టీకాలను వేయించాలి. వ్యాధి సోకిన తర్వాత వాటిని రక్షించడం చాలా కష్టం. అందుకు ముందుగానే వైద్యులను సంప్రదించి, ఆయా వ్యాధులు రాకుండా టీకాలు వేస్తుండాలి.

గాలికుంటు వ్యాధి, నంజు జ్వరం

ఇది వైరస్ సోకడం లేదా కలుషితమైన గాలి వలన వస్తుంది. తల్లిపాల ద్వారా దూడకు సోకే అవకాశం ఉంది. ప్రతి ఏడాది వర్షాకాలంలో వచ్చే వ్యాదుల్లో గాలికుంటు ఒకటి, గిట్టలున్న ప్రతి జీవికి ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన సమయంలో పశువులకు 104 నుంచి 105 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటిలో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడి, పశువులు నడవలేని స్థితికి చేరుకుంటాయి. వర్షాలు అధికంగా ఉంటే, చలి పెరుగుతున్నపుడు ఈ వ్యాధి విజృంభిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువుల నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా మారుతాయి. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడడం వలన పశువులు మేత తీసుకోలేక నీరసించి పోతాయి. ప్రధానంగా వర్షాకాలంలో నేలలు చిత్తడిగా ఉండడంతో గాలికుంటు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వలన చూడి పశువులు నీరసించిపోవడం, పాల దిగబడి తగ్గిపోవడం కనిపిస్తుంది.

నివారణ చర్యలు

ఈ వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి, నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిజరిన్ కలిపి పూయాలి. గిట్టల మధ్య పుండ్లకు పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేసి వేపనూనె రాయాలి. యాంటీ బయోటిక్, పెయిన్ కిల్లర్లు వాడితే ఉపశమనం కలుగుతుంది. బిస్ప్రెపెన్ 2.5, ఎన్‌రోఫ్లాక్సిన్ 50 ఎంఎల్, సెఫ్ ట్రిక్సిన్ 3 గ్రాములు, మెరోనెక్స్ 30 ఎంఎల్, నియోవట్ 50 ఎంఎల్ వాడితే పశువులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాయి.

రైతులు శ్రద్ధ చూపాలి

వర్షాకాలం వచ్చిందంటే పశువుల ఆరోగ్యం విషయంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పశువులకు ప్రధానంగా వర్షం పడ్డాక చిగురించే గడ్డి వలన వాధులు సోకుతుంటాయి. గొంతువాపు లక్షణాలు బయటపడిన 24 గంటల్లోనే పశువు మృతి చెందుతుంది. అందు వలన పాడి రైతులు పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు తప్పనిసరిగా వేయించాలి. గాలికుంటు వ్యాధి రాకుండా ఏడాదికి రెండు పర్యాయాలు వ్యాక్సిన్ వేయించాలి. ఇప్పటికే పశువులు, ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలకు 80 శాతం టీకాలు వేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పశు సహాయకులు టీకాలు అందజేస్తున్నారు.

– శ్రీమన్నారాయణ, పశు వైద్యాధికారి, కొత్తపల్లి